క్లుప్తంగా

1 నుంచి మెగా లోక్ అదాలత్

హఫీజ్‌పేట్: కూకట్‌పల్లి కోర్టులో జూన్ 1 నుంచి మెగా లోక్ అదాలత్ జరుగుతుందని మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేని కేసులలో పట్టుబడిన వారు మియాపూర్ ట్రాఫిక్ స్టేషన్‌కు ఆధార్ కార్డు, వాహన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్ 3 కాపీలు, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరు ఉదయం 8 గంటలకు హాజరవ్వాలన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు షురూ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2023–24 సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మీ సేవ సెంటర్ లో (లేదా) కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు బీఏ, బీకాం, కంప్యూటర్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసీసీఎస్ ,బీజెడ్ సీ,బీజెడ్ సీఎస్ గ్రూప్‌లలో ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో సుమారు 720 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటివిడతలో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు చివరి తేదీ జూన్10 అని తెలిపారు.

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చనల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం రంగారావు, రవికిరణ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో మహిళల స్వయం ఉపాధి కోసం బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్కు, జూట్ బ్యాగ్‌ల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. బ్యాచ్‌కి 10 సీట్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. వివరాలకు ఫోన్ నం.9396161936 సంప్రదించాలని కోరారు.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్‌జేబీ హిల్స్, శ్రీహోమ్స్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఎస్‌జేబీ హిల్స్‌లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులు, ప్యాచ్‌వర్క్‌లను పరిశీలించారు. శ్రీహోమ్స్ కాలనీలో రోడ్డు నెంబరు 2ఏ లో రోడ్డు ఛిద్రమైందన్నారు. కొత్త సీసీ రోడ్డు వేయాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.



శ్రీహోమ్స్ కాలనీలో ఛిద్రమైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుత్బుల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మునీరాబాద్‌కు చెందిన బండారి కృష్ణమూర్తి(26), మాలోత్ గణేష్ (37) కూలి పనులు చేస్తుంటారు. మంగళవారం ఇద్దరు కలిసి పని నిమిత్తం బైక్ (ఏపీ 23పీ 6989)పై దేవరయాంజాలకు వెళ్తుండగా మార్గ మధ్యలోని ప్రకృతి రిసార్ట్ సమీపంలో వేగంగా వచ్చిన లారీ (ఎంహెచ్ 14కేఏ 9918) ముందు వెళ్తున్న ట్రాక్టర్ (టీఎస్08 యూహెచ్ 9493)ను ఢీకొట్టింది. కాగా ట్రాక్టర్‌కు ఎడమ వైపు వెళ్తున్న బైక్‌ను సైతం ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న కృష్ణమూర్తి తలకు తీవ్రగాయాలు కాగా, వెనుక కూర్చున్న గణేష్ చేతులకు, పక్కటిములు విరిగాయి. క్షతగాత్రులకు పేట్‌బషీరాబాద్‌లోని హర్షా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ జుబేర్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా కూల్చివేతలు



- దశలవారీగా అక్రమ నిర్మాణాల తొలగింపు
- నాలుగు రోజుల్లో 50 గదులను కూల్చిన అధికారులు
- తిరిగి నిర్మాణాలు చేపట్టకుండా కట్టడి చేస్తున్నాం: తహసీల్దార్
- ప్లాట్లు అమ్మిన కబ్జాదారులపై ఫిర్యాదు చేస్తే క్రిమినల్ కేసులు పెడతాం
- అధికారులకు ఎక్కడ ఫిర్యాదు చేస్తారోనని బాధితులను బుజ్జగిస్తున్న కబ్జాదారులు
- ఎంతో కొంత ఇచ్చి.. మిగతావి తర్వాత ఇస్తామంటూ కబ్జాదారుల హామీలు





గాజులరామారం 307, 342, 329 సర్వే నంబర్లలో కూల్చివేతలు చేపడుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపిస్తూనే ఉన్నారు. గాజులరామారం సర్వే నం.329/1,342, 307 ప్రాంతాల్లో మంగళవారం కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ సంజీవరావు నేతృత్వంలో ఆర్ఐ రేణుకాదేవి, వీఆర్ఏలు సత్యనారాయణ, యాదగిరి సిబ్బంది కలిసి జేసీబీ సహాయంతో సుమారు 10 గదులను నేలమట్టం చేశారు. ఈనెల 16వ తేదీన పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టగా మిగిలి ఉన్న మరికొన్ని నిర్మాణాలను దశలవారీగా తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ జరుగుతున్న భూకబ్జా విషయంపై ఇప్పటికే ఆర్ఐ పరమేశ్వర్ రెడ్డి, వీఆర్ఏలు వాసు, దేవేందర్, నాగరాజు సస్పెండ్ గురైన విషయం తెలిసిందే. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో జనం లేని సమయంలో ఈ కూల్చివేతలు చేపడుతున్నారు. శని, ఆది, సోమ, మంగళవారాల్లో సుమారు 50 గదులను తొలగించినట్లు తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు. కూల్చి వేసిన ప్రాంతాలను ప్రతిరోజు వీఆర్ఏలతో నిఘా ఏర్పాటు చేసి తిరిగి నిర్మాణాలు చేపట్టకుండా కట్టడి చేస్తున్నామని తెలిపారు.

ఖాళీగా గదులను ఒక్కొక్కటిగా కూలుస్తూ..

రెవెన్యూ అధికారులు రూట్ మార్చారు. గుట్టుచప్పుడు కాకుండా ఎక్కడ ప్రచారం కల్పించకుండా గత రెండు రోజులుగా 307, 342, 329 ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ ముందుకు సాగుతున్నారు. ఒకవైపు దుండిగల్ మరోవైపు బాచుపల్లి మండలాల నుంచి వీఆర్ఏలను ఉపయోగించి ఆర్ఐ రేణుక ఆధ్వర్యంలో తహసీల్దార్ సంజీవరావు ఖాళీగా ఉన్న గదులను ఒక్కొక్కటిగా కూలుస్తూ వస్తున్నారు. ఉదయం ఖాళీ గదులను గుర్తించడం తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో వాటిని కూల్చి వేయడమే పనిగా పెట్టుకున్నారు.

◆ ఈ నెల 26వ తేదీ శుక్రవారం ×కూల్చివేతలకు బ్రేక్‌ఞఅన్న కథనాన్ని సాక్షిలో ప్రచురించగా కూల్చివేతలకు వెళ్లిన అధికారులకు ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురు కావడంతో మరుసటి రోజు శనివారం నుండే ఈ కూల్చివేతలు చేపడుతూ ఎక్కడ పత్రికలకు లీకు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

◆ పత్రికల్లో కూల్చివేతల సంఘటనలు రావడంతో ఒకసారిగా వాటిని కొనుగోలు చేసి మోసపోయిన అమాయక ప్రజలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ఆదేశాలతో ఎటువంటి ప్రచారం కల్పించకుండా గుట్టుచప్పుడుకాకుండా కూల్చివేతలు చేపడుతూ కబ్జాదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఈ సమయంలో అధికారులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తూ తమ పని పూర్తి చేస్తూ వస్తున్నారు.

కబ్జాదారుల 'సెటిల్'మెంట్లు...!

అధికారులు ఎక్కడపడితే అక్కడ కూల్చివేతలు చేపడుతున్న నేపథ్యంలో కబ్జాదారులకు చుక్కెదురైంది. ప్లాట్లు కొనుగోలు చేసిన మోసపోయిన వారికి ఎంతో కొంత ముట్టజెప్పి, మిగతావి తర్వాత ఇస్తాం.! అంటూ సెటిల్మెంట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల 400కు పైగా బేస్మెంట్ల , గదులు భారీ ఎత్తున కూల్చివేతలు చేపట్టడంతో ఈ క్రమంలో ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లు కొన్న బాధితులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కబ్జాదారులకు వ్యతిరేకంగా వారు పెద్ద ఎత్తున నినాదాలు చేసి వారి ఇళ్ల ముందు రోజుల తరబడి తిరుగుతుండడంతో కొంత మంది రాజీ కుదుర్చుకుంటున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో ఎవరైనా తాము 'ఫలానా'వ్యక్తి దగ్గర కొనుగోలు చేశామని అటు రెవెన్యూ అధికారులకు.. ఎటు పోలీసులకు ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేసే దిశగా ప్రయత్నిస్తున్న క్రమంలో కబ్జాదారులు 'రాజీ'కి రావడం ఇప్పుడు చర్చగా మారింది. ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లు చేసి క్రయవిక్రయాలు చేపట్టిన భూకబ్జాదారులు అధిక శాతం అధికార పార్టీ నాయకులే కావడం విశేషం.

"ఫిర్యాదు చేస్తే క్రిమినల్ కేసులు..



కబ్జాదారుల చేతుల్లో మోసపోయిన ప్రజలు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లు కొనడం గాని అమ్మడం నేరం. అమాయక ప్రజలు వీటిని గుర్తించండి. కబ్జాదారుల మాటలు నమ్మి మోసపోకండి. ఇప్పటికే పాలు సందర్భాల్లో వివరించాం. కూల్చివేతలు చేపట్టే సమయంలో మాకు ప్లాట్లు అమ్మిన కబ్జాదారులు కనిపించకుండా పోతున్నారు. వారిపై ఫిర్యాదు చేస్తే తప్పకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నా కబ్జాదారులపై కేసులు నమోదు చేశాం.

– సంజీవరావు, తహసీల్దార్ కుత్బుల్లాపూర్

కొలువులు రావాలంటే బీజేపీ ప్రభుత్వం రావాల్సిందే..

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: మోసపూరిత హామీలతో బీఆర్‌ఎస్ రెండుసార్లు గద్దెనెక్కి ప్రజలను నట్టేటా ముంచిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ×కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసాఞయాత్రలో భాగంగా మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డినగర్, పంచశీలకాలనీ, చెన్నారెడ్డినగర్‌లలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు యువకులు తమకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇవ్వలేదని ఆయనకు తెలిపారు. ప్రభుత్వ కొలువులు రావాలంటే బీజేపీ ప్రభుత్వం రావాల్సిందేనని అన్నారు.



భరోసా యాత్రలో భాగంగా రంగారెడ్డినగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని అన్నారు. ఉద్యోగాల గురించి అసెంబ్లీలో అడుగని వ్యక్తి ఉద్యోగ మేళా పేరుతో మరోసారి మోసం చేశాడరన్నారు. వేలాది ప్రైవేట్ ఉద్యోగాలంటూ పట్టుమని వెయ్యి ఉద్యోగాలు సైతం ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఎన్నికల ప్రచారానికి వస్తే ఎమ్మెల్యేను నిలదీయాలన్నారు.

◆ ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకుడు మోతే శ్రీనివాస్ యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గరిగె శేఖర్‌ముదిరాజ్, జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షుడు పరుష వేణు, ఏర్వ వెంకట్, ప్రవీణ్, సంజయ్, బండారి నారాయణ, రాకేష్, నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



అధికారులు, కౌన్సిలర్లతో సమావేశమైన మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, కౌన్సిలర్లతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్నాయని అన్నారు. అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయ, ప్రధాన చౌరస్తాల్లో లైటింగ్‌తో పాటు అమరవీరుల స్థూపాలను అలంకరించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రంగోళి, ఆటపాటలతో కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుండిగల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి

విద్యుద్దీపాలతో అలంకరించాలి

కుత్బుల్లాపూర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్ అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయంతో చౌరస్తాలను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. వైస్ చైర్‌పర్సన్ గంగయ్య నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫార్క్స్ డే ఈవెంట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కార్పొరేట్ కంపెనీ సింక్రొనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్క్స్ డే ఈవెంట్ ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉన్న నొవోటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పలు విందు, వినోదాలు సందడిగా సాగాయి. మల్ల ఖంబా యాక్ట్, దివ్యాన్ష్, మనురాజ్‌ల ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐటీ సంబంధిత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కొండపై ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కైలాసం గుప్తా, ప్రవీణ్ గుప్తా, రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- మంత్రి సీహెచ్ మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3న రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రైతు వేదికల వద్ద రైతు దినోత్సవ కార్యక్రమంలో రైతులు అందరూ పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన తెలంగాణ గొప్పదనాన్ని రైతులకు చెప్పాలని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలతో పాటు సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరించాలన్నారు. సంబంధిత అధికారులు రైతు వేదికలను అందంగా అలంకరణ చేయాలని మంత్రి ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని క్లస్టర్‌ల పరిధిలోని రైతులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరీ రేఖ, డీసీఓ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు నీరజాగాంధీ, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి శ్రీరామరక్ష

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే శ్రీరామరక్ష అని.. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ సురేందర్‌రెడ్డి గార్డెన్‌లో మాజీ కార్పొరేటర్ కెఎం గౌరీష్ ఆధ్వర్యంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి గర్వంగా నిలుస్తోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తున్నారని అన్నారు. వారి చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు కిషన్ రావు, సూర్యప్రభ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కిషోర్‌చారి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా మంగళవారం ఆయన మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి జయభేరి కాలనీలో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వరదనీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, వైస్‌చైర్మన్ గంగయ్యానాయక్, కౌన్సిలర్ సువర్ణ, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకకులు జెమ్మి దేవేందర్, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వేణుయాదవ్, సంగీత, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

హాథ్ సే హాథ్ జోడో

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణాలో సామాజిక న్యాయం సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం హెచ్ఏఎల్‌కాలనీ, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేపట్టారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం వరంగల్, హైదరాబాద్‌లలో రెండు యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. నాయకులు సంజీవరెడ్డి, జేమ్స్, జహంగీర్, అజయ్, రాహుల్, ఆసిఫ్, శ్రీనివాస్‌రావు, రాధా, శారదా తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోంది'

నిజాంపేట్: లేబర్ చట్టాలతో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని.. కార్మిక లోకం సంఘటితంగా ప్రతిఘటించాలని మేడ్చల్ జిల్లా సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రగతినగర్ ఎలీప్ ఇండస్ట్రీయల్ పరిధిలోని ఇంద్రానగర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం ఉద్యోగుల జీతాలు పెంచి రెగ్యులరైజ్ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ కార్మికులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మండల కన్వీనర్ బాలపీరు, కార్మిక నాయకులు మాణిక్యం, ప్రవీణ్, యాదగిరి, అసంఘటితరంగ కార్మిక నాయకులు శ్రీను, మానయ్య, విశ్వనాథ్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రానగర్‌లో సీఐటీయూ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

బంధువుల ఇంటికొచ్చి అదృశ్యమైన వృద్ధులు



దుర్గయ్య (ఫైల్)



పోశక్క (ఫైల్)

దుండిగల్: బంధువుల ఇంటికి వచ్చిన ఇద్దరు వృద్ధులు అదృశ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మార్గదర్శి కాలనీకి చెందిన దుర్గయ్య(70), పోశక్క (65) లు సూరారం కాలనీ ఓం జెండా బస్టాప్ ప్రాంతంలో ఉండే తమ బంధువు సూర్య ఇంటికి వచ్చారు. కాగా దుర్గయ్య చెల్లెలు అయిన సూర్య ఈనెల 15న మధ్యాహ్నం 2గంటల బయటకు వెళ్లి మరలా తిరిగి వచ్చి చూసే సరికి ఇద్దరు వృద్ధులు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధుల కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఇద్దరు వృద్ధుల మానసికస్థితి సరిగా లేదని తెలుస్తోంది.

క్షణికావేశంలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల: క్షణికావేశంలో ఓ యువకుడు ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేష్‌ప్రసాద్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి జీడిమెట్ల ఫేజ్–3లోని కామధేను గ్యాస్ కంపెనీలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. సురేష్‌ప్రసాద్ చిన్న కుమారుడు అజయ్‌కుమార్ కర్వాల్(23) సైతం అదే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడిన అజయ్‌కుమార్ చిన్నపాటి విషయానికే కోపోద్రిక్తుడు అయ్యాడు. తండ్రి నిద్రకు ఉపక్రమించిన అనంతరం అజయ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. ఇది గమనించిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'దోచుకోవడమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు ప్రవర్తిస్తున్నారు'

నిజాంపేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్ల ప్రభుత్వంగా మారిందని.. మౌలిక సదుపాయాలు కల్పించకుండా దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు ప్రవర్తిస్తున్నారని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిజాంపేట్‌ను వంద కోట్ల బడ్జెట్‌తో మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొంటున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డిలు గడిచిన 8 ఏళ్లలో ఏమి సాధించారని ప్రశ్నించారు. ప్రతి పనికి కమీషన్లు తీసుకుంటూ నాసిరకంగా పనులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

◆ కార్పొరేషన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర పథకాలుగా ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలపై పాదయాత్రలు నిర్వహిస్తూ అధికార పార్టీ తీరును ఎండగట్టాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సులోచన, రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, పార్లమెంట్ కో కన్వీనర్ రాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, రామచంద్ర నాయక్, సుమన్ రావు, కళ్యాణ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, నరేంద్ర చౌదరి, సంతోష్, విష్ణు, కార్యవర్గ సభ్యులు శివ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్లమెంట్ కన్వీనర్ శ్రీనివాస్, కార్పొరేషన్ అధ్యక్షుడు సతీష్